సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 17 । అక్టోబర్ । 2024



రేషన్‌కార్డులకు మోక్షమెన్నడో..!

కొత్త రేషన్‌కార్డుల కోసం లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. వెబ్ పోర్టల్‌లో ఆప్షన్లు నిలిపివేయడంతో అవస్థలు పడుతున్నారు.

- 8లో



అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్టు

గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు.

- 8లో

22 నుంచి ఎల్‌ఎల్‌బీ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఎల్‌ఎల్‌బీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 2 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం తెలిపారు. వర్సిటీ కేంద్రంగా పరీక్షల నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. రెండో సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, నాలుగో సెమిస్టర్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని వివరించారు.

న్యూస్‌రీల్

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.4.78 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: పాతపట్నంలో కొలువైన ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ.4,78,133 వచ్చిందని ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయ అధికారి జీవీబీఎస్ రవికుమార్ పర్యవేక్షణలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. 15 రోజులకుగాను ఈ ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దూసి రైల్వేస్టేషన్‌లో 'క్విట్ ఇండియా స్మృతివనం'



దూసి రైల్వేస్టేషన్ వద్ద మాట్లాడుతున్న పంక్వల్ పరమేశ్వరన్

ఆమదాలవలస: దూసి రైల్వేస్టేషన్ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమ స్మృతి వనం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పంక్వల్ పరమేశ్వరన్ అన్నారు. బుధవారం ఆమదాలవలస రైల్వే స్టేషన్‌లో నిర్వహిస్తున్న అమృత్‌భారత్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం దూసి రైలు నిలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భారత జాతీయ కళలు, సాంస్కృతిక వారసత్వ సంస్థ (ఇంటాక్) సీనియర్ సభ్యులు కలిసి దూసి రైల్వేస్టేషన్‌కు 1942 జూన్ 6న గాంధీజీ వచ్చారని వివరించారు. ఆయన ప్రసంగించిన స్థలంలో స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని కోరగా జీఎం సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో విశాఖ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఇంటాక్ సభ్యులు వావిలపల్లి జగన్నాథనాయుడు, కొమ్ము రమణమూర్తి, పొన్నాడ రవికుమార్, స్టేషన్‌మాస్టర్ మొదలవలస రవి తదితరులు పాల్గొన్నారు.

మరో ఆరు రీచ్‌లకు టెండర్లు



అరసవల్లి: జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో మరో ఆరు రీచ్‌ల నిర్వహణ హక్కులకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు మైన్స్ శాఖ డీడీ సి.మోహనరావు బుధవారం తెలిపారు. పురుషోత్తపురం -1, పురుషోత్తపురం-2 (సరుబుజ్జిలి), ముద్దాడపేట (ఎచ్చెర్ల), కిల్లిపాలెం (శ్రీకాకుళం), ముద్దాడపేట (ఆమదాలవలస), పర్లాం (నరసన్నపేట) రీచ్‌ల నుంచి ఇసుకను మాన్యువల్‌గా తవ్వి, స్టాక్ పాయింట్ వద్దకు ట్రాక్టర్ల ద్వారా రవాణా చేయడంతో పాటు వినియోగదారుల వాహనాల్లోకి లోడ్ చేసేందుకు గాను ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు కచ్చితమైన ధ్రువపత్రాలతో ఈ నెల 18వ తేది ఉదయం 11 గంటల్లోగా సీల్డ్ టెండర్లు దాఖలు చేయాలన్నారు. బేస్ ప్రైస్‌గా మెట్రిక్ టన్ను ఇసుకకు గరిష్ఠంగా రూ.110, కనిష్ఠంగా రూ.90గా జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిందని ప్రకటించారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికలు



ఎంపికలు ప్రారంభిస్తున్న వీసీ రజని


ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మైదానంలో ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ ఎంపికలను బుధవారం వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజని ప్రారంభించారు. విశ్వవిద్యాలయం, అఫిలియేషన్ కళాశాలల నుంచి 125 మంది విద్యార్థులు హాజరయ్యారు. అథ్లెటిక్స్, కల్చరల్, కమ్యూనికేషన్ స్కిల్స్, శారీరక దారుఢ్యం ద్వారా ఎంపికలు చేపట్టారు. వర్సిటీ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జోనస్థాయిలో పాల్గొని, అక్కడ ప్రతిభ కనబరిస్తే న్యూఢిల్లీలో జనవరి 26న నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశముంటుంది. ఎంపికైన వారికి జాతీస్థాయిలో శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల రీజనల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ, రిజిస్ట్రార్ సుజాత, జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎం.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మహల్‌పడలో.. మాయల మరాఠీలు




కంచిలి మండలం భోగాబెని పంచాయతీ మహల్‌పడ రెవెన్యూ పరిధిలో ఎన్సీ డెవలపర్స్ పేరుతో అక్రమంగా వేస్తున్న లేఔట్ ఇది. కూటమి ప్రభుత్వం వచ్చాక అకస్మాత్తుగా ఇక్కడ వెలిసింది. దీనికి ఎటువంటి అనుమతుల్లేవు. రెవెన్యూ కార్యాలయం నుంచి నాలా కూడా ఇవ్వలేదు. కానీ, 19.91ఎకరాల విస్తీర్ణంలో 996 ప్లాట్లు వేసి విక్రయాలు చేపడుతున్నారు. వ్యక్తుల పేరుతో రిజిస్ట్రేషన్లు కూడా చేసేస్తున్నారు.

- ఎన్సీ డెవలపర్స్ పేరుతో వేస్తున్న లేఔట్‌కు ఎటువంటి అనుమతుల్లేవని, ఇందులో జిరాయితీ భూములతో పాటు ప్రభుత్వ భూములు, డీ పట్టా భూములు ఉన్నాయని, ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని, ఎవరైనా కొనుగోలు చేస్తే కొనుగోలుదారుడిదే బాధ్యత అని కంచిలి తహశీల్దార్‌గా పనిచేసిన వై.జయలక్ష్మీ జారీ చేసిన పత్రికా ప్రకటనిది.



ఎన్సీ డెవలపర్స్ పేరుతో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న లేఔట్‌లో క్రయవిక్రయాలు జరుగుతున్నాయని, వాటికి సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని సోంపేట సబ్ రిజిస్ట్రార్‌కు కంచిలి తహశీల్దార్‌గా పనిచేసిన జయలక్ష్మీ అధికారిక లేఖ రాశారు. ఏయే సర్వే నెంబర్లు ఎవరి పేరున ఉన్నాయి.. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు, డీ పట్టా భూములున్నాయో లిఖిత పూర్వకంగా సబ్ రిజిస్ట్రార్‌కు నివేదించారు. వీరిపై చట్టపరమైన చర్యలకు పోలీసుస్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.



అనుమతుల్లేని లేఔట్‌గా పేర్కొంటూ క్రయవిక్రయాలు చేయరాదని హెచ్చరిస్తూ లేఔట్ వేస్తున్న ప్రదేశంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డిది. లేఔట్‌లో జిరాయితీ భూములు 95నుంచి 107, 109 నుంచి 111, 141,148,149, 150,151 నుంచి 174, 180 నుంచి 196 సర్వే నెంబర్లలో ఉండగా, ప్రభుత్వ భూములు 98,99,172,191,197 సర్వే నెంబర్లలో ఉన్నాయని, డీ పట్టా భూములు 174, 173, 177సర్వే నెంబర్లలో ఉన్నట్టు బోర్డులో ప్రదర్శించారు.



- కంచిలి మండలం మహల్‌పడలో అక్రమంగా వెలిసిన లేఔట్
- 19.91 ఎకరాల లేఔట్‌లో ప్రభుత్వ, డీ పట్టా భూములు
- కొనుగోలు చేయవద్దని కంచిలి తహశీల్దార్ హెచ్చరిక
- రిజిస్ట్రేషన్లు చేయవద్దని సోంపేట రిజిస్ట్రార్‌కు లేఖ
- అధికారులు హెచ్చరించినా వెనక్కి తగ్గని నిర్వాహకులు
- హెచ్చరిక బోర్డులో వివరాలను చెరిపేసి ఇష్టారాజ్యంగా విక్రయాలు
- కూటమి ప్రభుత్వంలో ఆగని అక్రమాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

పైవన్నీ చూస్తుంటే ఇక్కడెంత అడ్డగోలుగా, అక్రమంగా లేఔట్ వేసేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా లేఔట్ వేసేందుకు ల్యాండ్ కన్వర్షన్ చేసుకోవాలి. లేఔట్ ప్లాన్ అప్రూవల్ తీసుకోవాలి. దానికి రెవెన్యూ అధికారుల అనుమతులు పొందాలి. అన్నీ అనుమతులొచ్చాకే లేఔట్ వేయాలి. ఇక్కడ అందుకు భిన్నంగా జరిగింది. దీనివెనక ఏ నేత ఉన్నారో.. ఎవరి అండ చూసుకుని అక్రమంగా లేఔట్ వేస్తున్నారో.. దీనివెనక ఎంత మొత్తం చేతులు మారాయో తెలియాల్సి ఉంది. అనుమతుల్లేకుండా లేఔట్ వేయడమే కాకుండా ప్లాట్ల విక్రయాలతో పాటు రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. డెవలపర్స్ పేరుతో కాకుండా వ్యక్తుల పేరిట ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. సోంపేట సబ్ రిజిస్ట్రార్‌కు రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని నివేదించినా రియల్టర్ తెలివిగా వ్యక్తుల పేరుతో, సర్వే నెంబర్ల సబ్ డివిజన్ల వారీగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. కీలక నేత అండ చూసుకుని బరితెగించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హెచ్చరికలు బేఖాతరు..

అనుమతుల్లేని లేఔట్‌గా అధికారులు హెచ్చరించినా, ఇక్కడ లేఔట్‌లో ప్లాట్ల కొనుగోలు చేయవద్దని గ్రామాల్లో దండోరా వేయించినా నిర్వాహకులు వెనక్కి తగ్గడం లేదు. హెచ్చరిక బోర్డులో వివరాలు చెరిపేసి తమదైన శైలిలో ప్లాట్ల విక్రయాలు చేపడుతున్నారు. ఆకర్షణీయమైన బహుమతులతో 60గజాల ప్లాట్‌ను రూ.లక్షకు బేరం పెడుతున్నారు. ఇందుకు ప్రత్యేక బ్రోచర్ కూడా ముద్రించారు. స్థలంతో పాటు కోరుకున్న బహుమతిని ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుంటున్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో ప్లాట్ల విక్రయాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒకవైపు హెచ్చరికలు ఉన్నా కొందరు నిర్వాహకుల ట్రాప్‌లో పడుతున్నారు. భవిష్యత్‌లో కొనుగోలుదారులే మోసపోవాల్సి వస్తుంది. అనుమతులు తీసుకుంటే లేఔట్ స్వరూపమే మారిపోనుంది. పక్కాగా లేఔట్ వస్తే ప్రస్తుత కొనుగోలుదారులంతా నష్టపోక తప్పదు.



రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డుపై ఎరుపు రంగు పూసేసి, వివరాలు కన్పించకుండా చేసిన దృశ్యమిది. ఇది ఎవరు చేశారో ప్రత్యేకించి చెప్పుకోనక్కర్లేదు. కానీ, అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులోని వివరాలను చెరిపేయడాన్ని రెవెన్యూ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు.

మళ్లీ లైను కట్టాలా..?



ఈయన పేరు తెలుగు అసిరినాయుడు. మబగాం గ్రామానికి చెందిన ఒక మాజీ సైనికోద్యోగి. ఆయన కుటుంబానికి చెందిన భూమికి దశాబ్దాలుగా పట్టాలు, హక్కుపత్రాలు ఉన్నప్పటికీ మ్యుటేషన్ జరగటం లేదు. దీనికోసం స్థానిక రెవెన్యూ సిబ్బందిని చాలాసార్లు కలిసినా ఫలితం లేకపోయింది. పైగా స్థానిక శాసనసభ్యుని సిఫార్సు కూడా ఉందట. అయినా అక్కడి జనాలను చూసి ఇలా పోలాకి తహసీల్దార్ కార్యాలయం గేటు దగ్గర ఉన్న అటెండర్‌కు సర్వేయర్ సమక్షంలో వినతిప్రతం ఇచ్చి వెళ్లిపోవాల్సి వచ్చింది.

- రెవెన్యూలో మళ్లీ పాత పద్ధతే!
- అత్యవసర పనులు సైతం జాప్యం



పోలాకి తహసీల్దార్ గది బయట నిరీక్షిస్తున్న జనం

పోలాకి:

రెవెన్యూ సేవలు మళ్లీ మొదటికే వచ్చినట్లు ఉన్నాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వ కార్యాలయం ముందు లైను కట్టాల్సిన అవసరమే ఎవరికీ రాలేదు. ఇప్పుడు మళ్లీ క్యూలో నిలుచుని దీనంగా ఎదురుచూడాల్సిన పరిస్థితులు దాపురించాయి. వాస్తవానికి సచివాలయంలో గానీ, మీసేవా కేంద్రాల్లో గానీ రెవెన్యూ సేవల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న వారికి స్థానికంగా వీఆర్వో, ఆరువాత ఆర్ఐ, మండల సర్వేయర్ తదితరులు దరఖాస్తును పరిశీలించి తహసీల్దార్ లాగిన్‌లోకి పంపిస్తారు. అది గతంలో అప్పటికప్పుడే వీలైనంత తొందరలో తహసీల్దార్ ధ్రువీకరించి పంపించే వ్యవస్థ ఉండేది. ఇప్పటికీ ఆ రకమైన వెసులుబాటు ఉన్నప్పటికీ నిర్ణీత సమయంలోగా ధ్రువీకరణ జరగడం లేదని జనం ఆరోపిస్తున్నారు.



ఇతని పేరు రోణంకి చిరంజీవి. ప్రియాగ్రహారం రెవెన్యూ పరిధిలో 1.05 ఎకరాల పట్టాభూమి ఉంది. అవసరాలకు దాన్ని అమ్మకానికి పెట్టారు. మ్యుటేషన్‌లో ఇబ్బందులు ఉండటంతో రిజిస్ట్రేషన్‌కు అడ్డంకిగా మారింది. సమస్యను పరిష్కరించండి మహాప్రభో అంటూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడట. మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేచి చూడటం భోజనాల సమయాని ఇంటికి వెళ్లిపోవడమే జరుగుతోంది.

అత్యవసర సేవలేవీ పెండింగ్‌లో లేవు



మండలంలో అత్యవసర సేవలేవీ పెండింగ్‌లో లేవు. కొన్ని సేవలకు నిర్ణీత సమయం ఉంటుంది. పూర్తిస్థాయి విచారణ లేకుండా ఏ పనీ చేయటం కుదరదు. కావాలనే కొందరు పనికట్టుకుని ఇక్కడి సేవలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారేమో. మేమైతే నిబంధనలు పాటిస్తున్నాం.

– ఎం.సురేష్‌కుమార్, తహసీల్దార్, పోలాకి

దొంగగా భావించి దాడి

కాశీబుగ్గ: మందస మండలం సొండిపూడి గ్రామంలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి ఓ యువకుడ్ని దొంగగా భావించిన స్థానికులు వీధిలో ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా దొంగ కాదని నిర్ధారించారు. గ్రామంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్దకు ఇతర ప్రాంతాల వారు వచ్చి పూటుగా తాగడంతో ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని కొందరు చెబుతున్నారు.

ఇసుక మాఫియా దాష్టీకం

మా పైనే ఫిర్యాదు చేస్తావా...



బలగ - రిమ్స్ కూడలి వద్ద సురేష్ కారుపై దాడి చేస్తున్న దుండగులు

- ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్న సురేష్‌పై టీడీపీ వర్గీయుల దాడి
- కారును వెంబడించి.. కాలువలో తొక్కేసి..
- జిల్లా కేంద్రంలో వీరంగం సృష్టించిన 20 మంది దుండగులు

శ్రీకాకుళం క్రైమ్ : టీడీపీ వర్గీయులు బరితెగించారు. ఇసుక అక్రమాలు అడ్డుకుంటున్నాడనే అక్కసుతో దాడులకు తెగబడ్డారు. బుధవారం మిట్టమధ్యాహ్నం జిల్లాకేంద్రంలో బలగ – రిమ్స్ కూడలి సమీపంలో కారులో వస్తున్న సనపల సురేష్ అనే వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. తిరిగి అతనే తాగి డ్రైవింగ్ చేసి నలుగురి ప్రమాదానికి కారణమయ్యాడంటూ చిత్రీకరించి కారులో మందుబాటిళ్లు వేసి ఇరికించే ప్రయత్నం చేశారు. బాధితుడు సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

ఆమదాలవలసలో గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి గా పోటీచేసిన సనపల సురేష్ అనే వ్యక్తి ఓడిపోయినా ప్రజా సమస్యల పట్ల, ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిత్యం పోరాడేవాడు. కొద్దికాలంగా టీడీపీ వర్గీయులు చేస్తున్న ఇసుక, గ్రావెల్ అక్రమాలు బయటపెడుతున్నాడనే అక్కసుతో స్థానిక నేతలు కొంతమంది సెప్టెంబరు 27న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడంతో పాటు దాడికి కూడా యత్నించగా తప్పించుకున్నాడు. ఈ విషయమై బాధితుడు గతంలో కలెక్టర్, ఎస్పీ గ్రీవెన్సుల్లో మూడు నాలుగు సార్లు ఫిర్యాదు కూడా చేశాడు. ఈ క్రమంలో మంగళవారం ఆమదాలవలస మండలం దూసి ర్యాంపు (నాగావళి నది) నుంచి తరలించిన ఇసుకను శ్రీకాకుళం రూరల్ మండలం బావాజీపేటలోని రబ్బర్ తయారీ ఇండస్ట్రియల్ ఏరియాలో నిల్వ చేసిన విషయాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తనయుని సాయంతో బట్టబయలు చేశాడు. శ్రీకాకుళం మండల రెవెన్యూ అధికారి దానిని సీజ్ చేశారు.

బుధవారం ఏమైందంటే..

ఈ క్రమంలో బుధవారం మీడియా ప్రతినిధులు రావడంతో బావాజీపేట–దూసి ర్యాంపు ఇసుక పోగులను చూపించేందుకు సురేష్, మాజీ స్పీకర్ తనయుడు తమ్మినేని చిరంజీవినాగ్‌తో కలిసి వేర్వేరు కారులో బయలుదేరారు. చీమలవలసకు చెందిన సనపల చంద్రరావుతో కలిసి సురేష్ కారులో వెళ్తుండగా రాగోలు వద్ద ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మనుషులమంటూ కొంతమంది ద్విచక్రవాహనాలు అడ్డుగా పెట్టి ఆపారు. కొద్ది దూరం ముందుకు పోనిచ్చినా ద్విచక్రవాహనాల్లో ఎక్కువ మంది వెంబడించారు. ఈలోగా అశోక్ అనే వ్యక్తి కారు ఆపి అద్దాలు పగలుగొట్టాడు. ప్రాణాలను కాపాడుకునే క్రమంలో కారును వెనుకకు తీయగా సరుబుజ్జిలికి చెందిన వ్యక్తికి, మరో వ్యక్తికి కారు తగిలింది. అప్పటికీ దుండగులు వెంబడించడంతో నేరుగా ఎస్పీ కార్యాలయానికి వెళ్తుండగా బలగ – రిమ్స్‌కూడలి ప్రాంతంలో మళ్లీ ద్విచక్రవాహనాలు అడ్డుపెట్టి కారు ఆపారు. సుమారు 20 మంది వచ్చి సురేష్‌ను బయటకు లాగి దాడికి పాల్పడి డ్రైనేజీలో తోసేశారు. ఈ విషయమై స్థానికులు ప్రశ్నించగా.. రాగోలు వద్ద యాక్సిడెంట్ చేసి వచ్చేశాడని, తాగి ఉన్నాడని, మద్యం బాటిళ్లు ఉన్నాయంటూ ఇరికించే ప్రయత్నం చేశారు.



కాలువలోకి నెట్టేయడంతో ఆర్తనాదాలు

న్యాయం చేయాలి..



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సనపల సురేష్

ఈ విషయమై బాధితుడు సురేష్ మాట్లాడుతూ తనకు మద్యపానం అలవాటు లేదని, పోలీసులు కూడా తనిఖీ చేశారని, రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కూడా ఫిర్యాదు చేశానని చెప్పారు. గాయాలతో రిమ్స్‌కు వెళితే వైద్యులు చికిత్స చేయడం లేదని, ఎమ్మెల్యే కూన రవి ఫోన్‌ల్లో బెదిరిస్తుండటంతోనే పోలీసులు ఎంఎల్‌సీ కట్టడం లేదని వాపోయారు. ఇప్పటికీ రిమ్స్‌లోనే ఉన్నానని తెలిపారు. ఎమ్మెల్యే రవికుమార్ ఇసుక అక్రమాల ద్వారా రూ. 50 కోట్లు వెనకేసుకున్నాడని, అక్రమాలకు అడ్డుపడుతున్నాననే అక్కసుతోనే ఎమ్మెల్యే తనను హత్య చేయించేందుకు ప్రయత్నిస్తున్నాడని.. తనకు పోలీసులు న్యాయం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే అండతో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

- ప్రభుత్వ ఆస్తులు దోచుకుంటున్న వారిపై కేసులు పెట్టకపోవడంలో ఆంతర్యమేమిటి?
- వైఎస్సార్‌సీపీ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: నాలుగు నెలలుగా ఆమదాలవలస నియోజకవర్గంలో కోట్ల రూపాయల విలువ చేసే ఇసుకను ఎమ్మెల్యే కూన రవికుమార్, ఆయన అనుచరులు దోచుకుంటున్నారని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తుంటే రెవెన్యూ, పోలీస్, మైన్స్ అధికారులు ఏం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ప్రశ్నించారు. ఆమదాలవలస పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో, ఎన్నికల ప్రచారంలో ఉచిత ఇసుక విధానం తెస్తామని చెప్పి.. ఇప్పుడు ఇసుక రీచ్‌లకు టెండర్లు వేయడమేంటని ప్రశ్నించారు. సామాన్యులు ఇసుక కొనలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు పూర్తి కావస్తున్నా.. ఇసుక విధానం ప్రకటించకపోవడంలో ఆంతర్యం ఏమిటో తెలియజేయాలన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే రోజుకు 100 నుంచి 150 లారీల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ఒడిశా బిల్లులతో విచ్చలవిడిగా ఇసుక అక్రమ దందా నిర్వహిస్తున్నా.. అధికారులకు తెలియనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. మద్యం టెండర్లకు పది రోజులు గడువు ఇచ్చిన ఈ ప్రభుత్వం.. 108 ఇసుక ర్యాంపులకు దరఖాస్తులు చేసేందుకు రెండు రోజుల కాల పరిమితి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ చేస్తున్న ఇసుక దోపిడీపై ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే తామే పార్టీ తరఫున ఆందోళన చేసి అడ్డుకుంటామన్నారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్త పొన్నాడ చిన్నారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాక్సిడెంట్ కేసుల్లో సకాలంలో పరిహారం



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : రోడ్డు ప్రమాద కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ స్కీమ్ కన్వీనర్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో త్వరితగతిన న్యాయం జరగాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.అప్పారావు, డీఎస్పీ బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలాస ఆర్డీఓకు గుండెపోటు



సుదర్శన దొరను తరలిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస రెవెన్యూ డివిజన్ అధికారి సుదర్శన దొర బుధవారం గుండెపోటుకు గురై కార్యాలయంలోనే పడిపోయారు. ఇటీవలే విధుల్లో చేరిన ఈయన అనారోగ్యానికి గురికావడంతో వెంటనే సిబ్బంది కాశీబుగ్గలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యసేవలు నిమిత్తం కుటుంబ సభ్యులు విశాఖపట్నం తరలించి చికిత్స అందిస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ కురడింగికి చెందిన బాలుడిపై మంగళవారం పోక్సో, అత్యాచారం, అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.అనిల్‌కుమార్ తెలిపారు. గొర్రిబంద పంచాయతీకి చెందిన బాలిక 2021లో సారవకోట పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రోజుల్లో ఒక వ్యక్తితో పరిచయం అయింది. అనంతరం సారవకోటలో ఇంటర్ చదవడానికి బస్సులో రాకపోకలు చేసే సమయంలో తరచూ కలవడం, ఫోన్లో మాట్లాడుతుండేవారు. ఈ క్రమంలో ఇటీవల మాయమాటలు చెప్పి బాలికను లోబరుచుకోవడంతో ఆ బాలిక గర్భం దాల్చింది. ఆరోగ్యం సరిగా లేకపోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించగా మూడు నెలల గర్భవతి అని వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి వర్గాలు 1098కి, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు మైనర్‌పై పోక్సోతో పాటు ఇతర చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసును డీపీటీసీ డీఎస్పీ దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

బెల్లం తయారీ పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అటల్ భూజల్ బృందం

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతొర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న చెరుకు పంటను ఉత్తరప్రదేశ్‌కు చెందిన అటల్ భూజల్ బృందం ప్రతినిధి అనిల్ భజయ్ పరిశీలించారు. బెల్లం తయారీ, సాగు పద్ధతులను ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర విభాగం ప్రతినిధి కృష్ణారావు, రీజనల్‌- కోఆర్డినేటర్ హేమసుందర్ వివరించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎన్.ఎఫ్.ఎస్.శివ, శ్రీనివాస్, సూర్యనారాయణ, రమణ, పెంటయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

20న జిల్లా జూనియర్స్ ఖోఖో జట్ల ఎంపికలు



ఖోఖో సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ బాల బాలికల ఖోఖో జట్ల ఎంపికలు ఈ నెల 20న జరగనున్నాయని జిల్లా ఖోఖో అసోసియేషన్ శ్రీకాకుళం అధ్యక్ష కార్యదర్శులు చిట్టి నాగభూషణం, సీహెచ్ ఫల్గుణరావు బుధవారం తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు మొదలవుతాయని చెప్పారు. 2006 నవంబర్ 21 తరువాత జన్మించిన వారు అర్హులని స్పష్టంచేశారు. క్రీడాకారుల ఇండెక్స్ వయస్సు, బరువు, ఎత్తు కలిపి మొత్తం 250 పాయింట్లుగా ఉండాలన్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను అక్టోబర్ 25 నుంచి 27వ తేదీ వరకు చిత్తూరు జిల్లా కాణిపాకం వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో చాంపియన్‌షిప్‌–2024 పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పీడీ సాధు శ్రీనివాస్ (సెల్:9441914214)ను సంప్రదించాలన్నారు.

రేషన్‌కార్డులకు.. మోక్షమెన్నడో..!



- జిల్లాలో ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- వెబ్ పోర్టల్‌లో ఆప్షన్లు నిలిపివేత
- కొత్త కార్డులు, మార్పులు కోసం అవస్థలు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తున్నా కొత్త రేషన్ కార్డుల ఊసెత్తడం లేదు. దరఖాస్తు చేసుకుంటే అర్హత ఉన్నవారికి అందజేసే ఈ–రైస్‌కార్డును సైతం నిలిపివేసింది. పోనీ ఉన్న కార్డులు స్ప్లిట్టింగ్ చేసుకొనే వెసులుబాటునైనా కల్పించడం లేదు. ఒక చోట నుంచి మరొక చోటుకి రేషన్ కార్డును మార్చుకునే అవకాశం కూడా ఇవ్వడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● గత ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్త కార్డుకి దరఖాస్తు చేసుకుంటే వెంటనే వారం తిరగకుండానే కొత్త కార్డు మంజూరయ్యేది. మరుసటి నెల నుంచే ఆ కార్డులో ఉన్నవారికి ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందజేసేవారు. ఈ కార్డు బియ్యం, ఇతర నిత్యవసర వస్తువులతో పాటు ఆరోగ్య శ్రీ పథకం ప్రయోజనం, పిల్లల చదువులు, రుణాలు, ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలకు ఉపయోగపడేది. దీంతో ఎంతోమంది పేదలు ప్రయోజనం పొందేవారు.

● ఆప్షన్లు నిలిపివేత

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సివిల్ సప్లయ్ పోర్టల్‌లో ఉన్న ఈ ఆప్షన్లను నిలుపుదల చేశారు. ఈ పోర్టరు మూసి వేయడంతో కార్డుకు సంబంధించి ఎటువంటి వ్యవహారాలు జరగడం లేదు. ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు రాష్ట్రంలో ఒక్క కార్డు కూడా ఇవ్వలేదు. అలాగే యాడింగ్ కూడా లేకపోవడంతో నూతనంగా వివాహం అయినవారు, పిల్లలు పుట్టినవారు కొత్తగా కార్డులో చేర్చుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. జిల్లాలో కొత్త కార్డులు, స్ప్లిట్టింగ్ కోసం సుమారుగా 45,000 మంది ఎదురు చూస్తున్నారు. అలాగే మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం 23,400 మంది ఉన్నారు. ఒక చోటు నుంచి వేరొక చోటుకి బదిలీ చేసుకునేందుకు 4,500 మంది వేచి ఉన్నారు.

యాడింగ్ కోసం చూస్తున్నాను



నాకు ఇద్దరు పిల్లలు. వారి ఆధార్ కార్డులు చేయించాను. ప్రస్తుతం నాకు బియ్యం కార్డు ఉంది. దీంతో ఆ కార్డులో నా ఇద్దరి పిల్లలను చేర్పించాలని నాలుగు నెలలుగా ప్రయత్నిస్తున్నారు. పలుమార్లు సచివాలయం, సివిల్ సప్లయ్ అధికారుల వద్దకు వెళ్లి అడిగాను. కానీ వెబ్ పోర్టల్‌లో ఆప్షన్ లేదని, లాగిన్ పనిచేయడం లేదని వారు చెప్పారు. కూటమి ప్రభుత్వం పేదల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఆ లాగిన్‌ను తిరిగి పునరుద్ధరించాలని కోరుతున్నాను. – **పేడాడ కాంతారావు, శ్రీకాకుళం**

పశువుల రవాణా అడ్డుకున్న పోలీసులు

● ఇద్దరిపై కేసు నమోదు



పశువులు రవాణా చేస్తున్న లారీ

కంచిలి: మండలంలోని సోంపేట రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా కవిటి నుంచి తుని తరలిస్తున్న 32 పశువులను కంచిలి పోలీసులు బుధవారం అడ్డుకున్నారు. ఈ పశువులను కవిటి మండలం జమేదారుపుట్టుగ గ్రామానికి చెందిన దాసరి చంద్రముణి కొనుగోలు చేసి తుని చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్మకానికి తీసుకెళ్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం ప్రకారం పశువుల రవాణాను అడ్డుకొని 32 పశువులను, రవాణాకు ఉపయోగించే లారీని స్వాధీనం చేసుకొని, జమేదారుపుట్టుగ గ్రామానికి చెందిన దాసరి చంద్రముణి, అనకాపల్లికి చెందిన లారీ డ్రైవర్ కిల్లి సత్యనారాయణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

ఆమదాలవలస: కృషి విజ్ఞాన కేంద్రంలో 15 రోజులు పాటు వ్యవసాయ సహకార సంఘ ప్రతినిధులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం మేనేజ్ మరియు సమితి సౌజన్యంతో వ్యవసాయ సహకార సంఘ ప్రతినిధులకు 15 రోజుల సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికేట్ కోర్సును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథ స్వామి మాట్లాడుతూ రైతులకు ఎరువుల డీలర్స్‌గా మారడానికి ఈ శిక్షణా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను కూడా వ్యవసాయంలో వినియోగిస్తే పర్యావరణం కలుషితం కాకుండా మానవాళి ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుందని వివరించారు. ఎరువులు వాడకములోని మెలకువలను శిక్షణ కార్యక్రమం ద్వారా అందరూ తెలుసుకొని రైతు సోదరులకు ఉపయోగపడేవిధంగా అవగాహన కల్పించవచ్చని వివరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ, డాక్టర్ జి.చిట్టిబాబు, డాక్టర్ అనూష, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, శ్రీకాకుళం జిల్లా ప్రాథమిక సహకార సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు .

మద్యం షాపులపై నిఘా

శ్రీకాకుళం క్రైమ్ : మద్యం షాపులపై నిఘా పెడతామని.. బడి, గుడి వంటి ప్రదేశాల్లో హైకోర్టు నిబంధనలనుసరించి వంద మీటర్ల దూరంలో షాపులు ఉండేలా చూసుకోవాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న మరిన్ని అంతర్రాష్ట్ర ముఠాలను పట్టుకుంటామని చెప్పారు. చైన్ స్నాచింగ్, టెంపుల్ అఫెన్సెస్, ఒంటరి నివాస గృహాల్లో చోరీలపై ప్రత్యేక బృందాలు ఇప్పటికే గాలిస్తున్నాయని, కొంతమందిని గుర్తించినట్లు చెప్పారు. చోరీలను అరికట్టేందుకు సీసీ కెమెరాల వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని, జిల్లా కేంద్రంగా సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 950 కెమెరాలున్నాయని తెలిపారు. మద్యం షాపుల వద్ద కొనుగోలుదారులు ఎట్టి పరిస్థితిలో మందు తాగరాదని, బహిరంగ ప్రదేశాల్లోనూ ఇదే వర్తిస్తుందని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణాపై మరింత నిఘా పెట్టామని, ఒడిశా నుంచే ఎక్కువ వస్తుండటంతో అక్కడి అధికారులతో మాట్లాడుతున్నామని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గ్రేహౌండ్స్, ప్రత్యేక బలగాలు, టాస్క్‌ఫోర్స్ ఉన్నట్లు ఒడిశా సరిహద్దుల్లో కూడా ఉండేలా ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రభుత్వానికి నివేదిస్తామని ఎస్పీ తెలిపారు.

గొంతు కోసి హత్యాయత్నం



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు పుక్కళ్ల రాము

శ్రీకాకుళం క్రైమ్ : మిట్ట మధ్యాహ్నా వేళ ఓ యువకుడి మెడపై కత్తితో వేటు వేశారు.. అదీ పెద్దల సమక్షంలో.. బుధవారం జిల్లాకేంద్రంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి దమ్మలవీధిలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు పుక్కళ్ల రాము, తల్లి లక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. నెలరోజుల కిందట వినాయకచవితి రోజు రాత్రి దమ్మలవీధిలో యువకుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో పుక్కళ్ల రాము, అతని తల్లి లక్ష్మిపై 20 మంది వచ్చి దాడి చేశారు. అప్పట్లో రిమ్స్‌లో ఎంఎల్‌సీ కూడా నమోదైంది. రెండు రోజుల క్రితం బాబా కోవెల వద్ద రెండు వర్గాల మధ్య మళ్లీ గొడవైంది. ఈ విషయమై పెద్దల సమక్షంలో రాజీ చేసుకుందామని పండు అనే యువకున్ని బాధితుడు రాము వద్దకు బుధవారం పంపించారు. మధ్యాహ్నం దమ్మలవీధి ఆంజనేయ కోవెల వద్ద పెద్దలందరి సమక్షంలో చర్చలు సాగుతుండగా ప్రసాద్ అనే వ్యక్తి మడత కత్తితో రాము మెడపై దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయం కావడంతో వెంటనే బాధితుడిని రిమ్స్‌లో చేర్పించగా 18 కుట్లు వేశారు. ఈ ఘటనపై రిమ్స్ ఔట్‌పోస్టులో ఫిర్యాదు నమోదైంది.

సూపర్‌వైజర్ల ఆందోళన

శ్రీకాకుళం క్రైమ్: ఎచ్చెర్ల డిపో వద్ద మద్యం స్టాక్‌ను హ్యాండోవర్ చేసుకోకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసిన సూపర్‌వైజర్లు వాపోయారు. బుధవారం రాత్రి పదిన్నర గంటలు దాటినా సుమారు 50కు పైగా షాపుల స్టాకును అక్కడి సిబ్బంది లేరంటూ వాహనాల్లో దించకుండా అలానే ఉంచేశారని సూపర్‌వైజర్ల స్టేట్ యూనియన్ అధ్యక్షుడు బి.శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయమే మంగళవారం సేల్ చేసిన మద్యం అమౌంట్ చలానాలు కట్టేశామన్నారు. మద్యం స్టాకును ఎచ్చెర్ల డిపోకు, ఇతర సామాన్లు ఆమదాలవలస గోడౌన్‌కు తామే వెహికల్స్ పెట్టి తీసుకెళ్లి దింపుతున్నామన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి వాహనాల్లో నుంచి స్టాకు దింపకపోవడంతో అక్కడే తమ సూపర్‌వైజర్లు ఉండిపోవాల్సి వస్తోందని, ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. స్టాకు ఏమైనా దొంగతనానికి గురైతే తమపైనే నిందలు వేస్తారని మండిపడ్డారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కాశీబుగ్గ: మందస మండలం సిద్దిగాంలో భర్త అనారోగ్యానికి గురవ్వడంతో పురుగుల మందు తాగి మాళవిక అనే వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో ఆమెను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. భర్త రాజేష్ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి గాయాలు



బస్సు వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆమదాలవలస: పట్టణ సమీపంలోని మండాది గ్రామం వద్ద పాలకొండ నుంచి శ్రీకాకుళం వెళ్లే బస్సులో అధిక జనాభా ఉండడంతో కొంతమంది విద్యార్థులు ఫుట్‌బోర్డు వద్ద నిలబడి బుధవారం ప్రయాణం చేశారు. అయితే అందులో ఒక విద్యార్థి ఫుట్‌బోర్డు మీద నుంచి జారి పడడంతో కాలికి గాయమైంది. దీంతో విద్యార్థులంతా రోడ్డుపై బైఠాయించి బస్సు సర్వీసులు పెంచాలని, బాధిత విద్యార్థికి న్యాయం చేయాలని కోరుతూ కాసేపు నిరసన చేపట్టారు. బస్సు సిబ్బంది, స్థానికులు అక్కడికి చేరుకొని విద్యార్థికి వైద్యసేవలు అందించారు.

హడావుడి చేశారు.. అర్ధంతరంగా ఆపేశారు..

● గోపాలపెంట ఇసుక ర్యాంపు ప్రారంభం వాయిదా



మాట్లాడుతున్న ఆర్డీఓ ప్రత్యూష

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంటలో ఇసుక ర్యాంపు ప్రారంభ కార్యక్రమం వాయిదా పడింది. ఉదయం నుంచి ర్యాంపు వద్ద మైన్స్, రెవెన్యూ అధికారులు హడావుడి చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిలు ర్యాంపును ప్రారంభిస్తారని ఏర్పాట్లు చేశారు. ఆర్డీఓ సాయి ప్రత్యూష స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం 10.30 అని మొదట చెప్పి.. తరువాత 12 గంటలకు అని ప్రకటించారు. మళ్లీ ఒంటి గంటకు కలెక్టర్ వస్తున్నారని చెప్పారు. అప్పటి వరకూ ఆర్డీఓతో పాటు మైన్స్ అధికారులు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ మధుసూదనరావు, ఇతర అధికారులు వేచి ఉన్నారు. 1.15 గంటలకు ర్యాంపు ప్రారంభోత్సవం లేదని సమాచారం రావడంతో అందరూ వెనక్కి వెళ్లిపోయారు. కాగా, గోపాలపెంట ర్యాంపునకు పూర్తి అనుమతులు రాకుండానే అధికారులు ప్రారంభోత్సవానికి అత్యుత్సాహం చూపించారని తెలుస్తోంది. అలాగే, రీచ్‌ల్లో ఇసుకను తోడి స్టాక్ పాయింట్లకు తరలించే ఏజెన్సీని నిర్ణయించడంలో కూడా విమర్శలు రావడం, మొదట అధికారులు ప్రకటించిన హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్ఆర్ ఏజెన్సీకి కాదని శ్రీకాకుళంకు చెందిన పీవీఎస్ ఏజెన్సీకి టెండర్ ఇవ్వడంతో అభ్యంతరం తెలిపినట్లు సమాచారం.

రూ.261 కోట్లతో అభివృద్ధి పనులు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు

సారవకోట: జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.261 కోట్లతో 3,071 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గోవర్ధనపురం పంచాయతీ అర్లి గ్రామంలో అర్లి నుంచి గోవర్ధనపురం గ్రామానికి రూ.1.82 కోట్లతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 8 నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. నరసన్నపేట నియోజకవర్గానికి రూ.19 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలకు చెత్త సేకరణపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం బెజ్జి నుంచి ముంజువానిపేట గ్రామానికి వెళ్లే రహదారికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అర్లి నుంచి గోవర్ధనపురం వెళ్లే రహదారికి స్థలం విరాళంగా ఇచ్చిన జెజ్జి జీవరత్నం, నవిరి అప్పారావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణారావు, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ధర్మాన తేజ్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో కృష్ణ మోహన్, రామదాస్, కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులను విశ్రాంత భవనాల్లో చేర్పించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి

కొత్తూరు: గర్భిణులను సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనాల్లోకి చేర్పించే విధంగా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని కురిగాం పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వైద్య శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల అమలు తీరును పరిశీలించారు. అందుకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అత్యవసర మందులు నిల్వ ఉండే విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందివ్వాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఆయనతో పాటు వైద్యాధికారులు సందీప్ కుమార్, ప్రసన్నకుమార్, ఈవో బుజ్జి బాబు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్ సూరి

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బుడుమూరు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొందూరు మండలం నరసాపురం అగ్రహారం గ్రామానికి చెందిన ఆవాల సూరి (45) అనే ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. హైవేలో గార్డెన్ వర్క్ చేయడం కోసం ట్రాక్టర్‌ను రోడ్డుమీద నిలపగా, విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ట్యాంకర్ ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రాక్టర్ మీద ఉన్న డ్రైవర్ సూరి కిందపడి గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. లావేరు ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దానయ్య

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాతటెక్కలికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎం.దానయ్య, కొల్లి మౌర్య, కొల్లి దామోదరరావులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎం.గిరి, ఎం.గంగయ్యలు దాడికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రాత్రి అమ్మవారి గుడి వద్ద నుంచి పత్రి కొమ్మలు తీసుకుని పొలాల్లో వేసి తిరిగి వస్తున్న సమయంలో పాతటెక్కలి టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తగా పని చేస్తున్న ఎం.గిరి రాజకీయ కక్షలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డాడు. బలమైన గాయాలు కావడంతో బాధితులు 108 వాహనంలో పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. రాజకీయంగా వేధిస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలంటూ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ కార్యకర్తలు ఎం.గిరి, ఎం.గంగయ్య, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎం.దానయ్య, కె.మౌర్య, కె.దామోదరరావులపై కేసు నమోదు చేసినట్లు వజ్రపుకొత్తూరు ఏఎస్‌ఐ కె.జిన్నారావు తెలిపారు.

చికిత్స పొందుతూ తల్లి మృతి



ఆస్పత్రిలో మృతి చెందిన తల్లి దుర్గ

సంతబొమ్మాళి: తన ఇద్దరి పిల్లలకు విషమిచ్చి చంపి, తానూ ఆత్మహత్యకు ప్రయత్నించిన తల్లి దుర్గ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందింది. మంగళవారం 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించిన విషయం తెలిసిందే. అయితే వైద్యానికి ఆమె సహకరించలేదు. వైద్యులు పలుమార్లు నచ్చజెప్పినా నిరాకరించడంతో పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. చిన్నారులు ఋషి, బాలాజీ మృతదేహాలకు స్వగ్రామమైన కుముందానివానిపేటలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి రాజు చిన్నారులకు తలకొరివి పెట్టారు. ఈ అంత్యక్రియలకు చుట్టుపక్కల గ్రామస్తులు తరలివచ్చి, కన్నీరు పెట్టుకున్నారు.

ఇంటర్‌లో నూతన విద్యా విధానం



పరీక్షలను పరిశీలిస్తున్న డీవీఈఓ తవిటినాయుడు

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వం ఇంటర్మీడియట్‌లో తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్.తవిటినాయుడు అన్నారు. బుధవారం వజ్రపుకొత్తూరు మండలం పూండి–గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు, స్టడీ అవర్స్, సైన్స్ ప్రయోగాలు జరుగుతాయని చెప్పారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచాలని అధ్యాపకులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, ఇన్‌చార్జి రమణమూర్తి అధ్యాపకులు రూప్‌సుందర్, టి.తిరుపతిరావు, రమణ, రాంబాబు, భాగ్యవతి, శోభారాణి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్టు

● నిందితుడిపై పలు రాష్ట్రాల్లో కేసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలోని కాశీబుగ్గ సబ్ డివిజన్ కంచిలి, బారువ, వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గల్లో ఈనెల 1వ తేదీన వరుస చైన్ స్నాచింగ్‌లతో సంచలనం సృష్టించిన ఒడిశా రాష్ట్రం జాజిపూర్ గ్రామానికి చెందిన చిన్మయ ప్రధాన్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు వివరాలను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం వెల్లడించారు. కేసులో మరో ముగ్గురు నిందితులు ఒడిశా రాష్ట్రం జాజిపూర్‌కు చెందిన సంతోష్ ప్రధాన్, బిజయ్ ప్రధాన్, సంజయ్ ప్రధాన్‌ల కోసం గాలిస్తున్నారు. ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని పుస్తెల తాడు, గొలుసులు తెంపడమే వీరి లక్ష్యమని ఎస్పీ తెలియజేశారు. రెండు ద్విచక్రవాహనాల్లో క్షణాల్లో పరారవ్వడం, వేసుకున్న దుస్తులను, బండికున్న నంబర్ ప్లేట్లను తక్షణమే మార్చేయడం వీరి చోరీ స్టైల్ అన్నారు. నాలుగు చోరీల్లో దోచుకున్న సొత్తును చిన్మయ్ ప్రధాన్, మిగతా వారితో కలిసి కంచిలి మండలం జాడుపూడి కాలనీ కూడలి దగ్గరలో బోలా శంకర్ దాబా వెనుక ఒక చెట్టు దగ్గర గొయ్యి తీసి పాతిపెట్టి వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఈనెల 15న దాచిన సొత్తును తీసుకెళ్లడానికి వచ్చినవారిని సోంపేట సీఐ మంగరాజు తమ టీమ్‌తో కలిసి మాటువేసి పట్టుకున్నట్లు వెల్లడించారు. మొత్తం 10 తులాల బంగారంలో ఆరున్నర తులాల బంగారం రికవరీ చేశారు. మిగిలిన బంగారాన్ని వేరుచోట దాచిపెట్టినట్లు తెలిపారు. ఇతడిపై ఒడిశా, వెస్ట్ బెంగాల్, అస్సాం, బీహార్‌లలో చోరీ కేసులు ఉన్నట్లు తెలియజేశారు.

– ఎస్పీ ప్రశంసలు

కేసును బృందాలుగా ఏర్పడి చాకచక్యంగా ఛేదించిన జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, సోంపేట సీఐ మంగరాజు, కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు, కంచిలి ఎస్‌ఐ రాజేష్, వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ నిహార్, హెచ్‌సీ గవరయ్య, పీసీలు బషీర్, నీలకంఠం, రాధాకృష్ణ, శ్యామ్ (సీసీఎస్), షణ్ముఖ, ప్రేమ్‌కుమార్‌లను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా ప్రశంసించారు.